క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బొబ్బిలి: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు సూచించారు. స్థానిక పట్టణంలోని నాయుడుకాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆయన సోమవారం పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సోమవారం సందర్శించారు. తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లిన ఆయన వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యాప్రమాణాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అంతకుముందు లెస్సన్ ప్లాన్, డైరీలను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీ కె.చంద్రరావు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యం

రాజాం: క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా వైద్యశాఖ చర్యలు చేపడుతోందని క్షయ వ్యాధి నివారణ విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ లలిత అన్నారు. మండలంలోని ఒమ్మి, నర్సింహపురం తదితర గ్రామాల్లో క్షయవ్యాధి నిర్మూలనపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరి మాట్లాడుతూ వ్యాధిని ఆరంభంలో పసిగడితే త్వరితగతిన నయం చేయడంతో పాటు సకాలంలో వ్యాధి నిర్మూలనకు కృషి చేయవచ్చన్నారు. వ్యాధి ప్రబలకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని కొత్తారిపురం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. చిన్నారుల కొత్త ఆధార్ నమోదుతో పాటు అప్‌డేట్‌లను తప్పులు లేకుండా చేయాలని సూచించారు. ఇంకా ఆధార్ నమోదు చేయించుకోని వారు త్వరగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాజాం సిటీ: ప్రత్యేకావసరాలు గల చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వై.దుర్గారావు కోరారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు అందించిన ఫిజియోథెరపీ సేవలను ఆయన సోమవారం పరిశీలించారు. ప్రతిరోజూ ఫిజియోథెరపీ చేయడం ద్వారా మార్పు త్వరగా తీసుకురావచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎం.రామచంద్రిక, ఐఈఆర్‌టీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

బాడంగి: మండలంలోని భీమవరంగ్రామంలో తెర్లివాని కళ్లాల్లో సోమవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే బాడంగి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. బూడిదైన గడ్డివాములు ఆ గ్రామానికి చెందిన రైతు తెర్లి శ్రీనివాసరావువి కాగా రూ.20 వేల వరకు నష్టం వచ్చినట్లు బాధిత రైతు వాపోయారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకురావాలని, ప్రకృతి సేద్యం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో రేఖ, మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పి.రమాదేవి పాల్గొన్నారు.

'వన్‌స్టాప్' సేవలు వినియోగించుకోండి

బొబ్బిలి: మహిళల రక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సెంటర్ ప్రతినిధి తాన్న అనిత కోరారు. స్థానిక పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు వన్‌స్టాప్ సెంటర్ సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఏదైనా ఆపదలో ఇరుక్కున్న విషయం గ్రహించిన వెంటనే రక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 181, 1098, 112లకు ఫోన్ చేసి వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పశువైద్య శిబిరాలు

బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్ : అన్ని గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. సోమవారం పలు గ్రామాల్లోని శిబిరాల్లో పశువులు సహా గొర్రెలు, మేకలు వంటి మూగజీవాలకు వైద్య సిబ్బంది తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పలు వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేశారు. పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తం కావాలని, వ్యాధి లక్షణాలతో జీవాలు బాధపడితే తక్షణమే వైద్యులను సంప్రదించి, సలహాలు, సూచనలు పొందాలన్నారు.

రేషన్ సరుకుల్లో కోత

- ఫిబ్రవరి నెల రేషన్‌లో కందిపప్పు కట్!
- నెలనెలా తగ్గుతున్న ఉచిత రేషన్ సరుకులు
- ఓ చోట బియ్యం, కందిపప్పు, పంచదార ఇస్తే.. మరోచోట బియ్యం మాత్రమే పంపిణీ
- ఆందోళనలో లబ్ధిదారులు

రామభద్రపురం:

రేషన్ షాపుల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు అందాల్సిన నెలవారీ రేషన్ సక్రమంగా అందడం లేదు. కొన్నిచోట్ల బియ్యం, కందిపప్పు, పంచదార ఇస్తే.. మరోచోట బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం ఖర్చును తగ్గించుకునే యోచనతోనే ఇదంతా చేస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసే సరుకుల్లో ప్రస్తుతం కంది పప్పు కార్డుదారులకు అందే పరిస్థితి లేదు. ఫిబ్రవరి నెల రేషన్ సరుకుల్లో బియ్యం మాత్రమే కార్డుదారులకు అందజేయనున్నారు. బియ్యంతో పాటు కిలో కందిపప్పు సబ్సిడీ ధరలకు కార్డుదారులకు అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు సీఎస్ గొడౌన్‌లలో నిల్వలు లేకపోవడంతో రేషన్ షాపులకు సరుకుల పంపిణీ జరగలేదు. ప్రస్తుతం రేషన్ షాపులో కందిపప్పు కిలో రూ.67 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో దానిని రూ.170కు విక్రయిస్తున్నారు. నిరుపేదలు అంత ఖరీదు పెట్టి కందిపప్పు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. దీంతో ఫిబ్రవరి నెలలో పచ్చడి మెతుకులతోనే సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి నిరుపేదలకు ఏర్పడింది. గత ప్రభుత్వంలో ఇలాంటి కోతలు లేవని కూటమి ప్రభుత్వం వచ్చాకే కందిపప్పు, రాగిపిండి కోతలు పెట్టారని అంతా విమర్శిస్తున్నారు.



రామభద్రపురంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.170..

నియోజకవర్గంలోని బొబ్బిలి మండలంలో 35,954, బాడంగి మండలంలో 14,813, రామభద్రపురం మండలంలో 15,328, తెర్లాం మండలంలో 18,742 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలోని చంద్రబాబు సర్కారు వీరందరికీ ఫిబ్రవరి నెలలో బియ్యానికే పరిమితం చేసింది. మార్కెట్‌లో కందిపప్పు, పంచదార వంటి సరుకుల రేట్లు అధికంగా ఉండడంతో వాటిని పేదలు కొనుగోలు చేయలేకపోతున్నారు. తద్వారా పౌష్టికాహారం తీసుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కందిపప్పు, పంచదార, రాగిపిండి సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

కూటమి వచ్చాక అన్నీ ఇబ్బందులే..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ఇబ్బందులే.. సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా చాలా పథకాలు రద్దు చేశారు. ఇప్పుడు రేషన్ సరుకుల్లో కూడా కోత పెట్టారు. ఒక నెల ఒకటి ఇస్తే మరొక నెల మరొకటి ఇవ్వడం లేదు.

–చొక్కాపు రామలింగేశ్వరరావు, రామభద్రపురం

మార్చి నుంచి పూర్తిస్థాయిలో పంపిణీ..



గోదాంలకు ఒక్క బియ్యం స్టాక్ మాత్రమే వచ్చింది. కందిపప్పు స్టాక్ ఇంకా రాలేదు. దీంతో కందిపప్పు పంపిణీ చేయడం లేదు. మార్చి నుంచి పూర్తిస్థాయిలో కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. స్టాక్ వచ్చిన వెంటనే అందజేస్తాం.

–రెడ్డి సాయికృష్ణ, సివిల్ సప్లయి డీటీ

అధికంగా అద్దెలు వసూలు చేస్తున్నారు..!

బొబ్బిలి: ఐసీడీఎస్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అయితే ఆయా కేంద్రాల కార్యకర్తలు మాత్రం భవన యజమానికి ఇవ్వాల్సిన అద్దె కన్నా ఎక్కువ అద్దె వసూలు చేసి, యజమానికి ఇవ్వాల్సింది ఇచ్చి మిగతా సొమ్మును వారే దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే ఐసీడీఎస్ పీడీ, రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు అందాయి. అప్రమత్తమైన ఐసీడీఎస్ ఉన్నతాధికారులు విచారణకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఆదేశించారు. భవనాల కొలతలు, అద్దె చెల్లింపులను చూడాలని కోరారు. ఈ నేపథ్యంలో బొబ్బిలి పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలంతా తహసీల్దారు ఎం.శ్రీనును ఇటీవల కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. అసలు అద్దె కన్నా అధికంగా అద్దెలు వసూలు చేస్తున్నామని తమపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వాపోయారు. స్పందించిన తహసీల్దారు.. తమ వద్ద ఈ విషయం చెప్పుకుంటే ప్రయోజనం లేదని, విచారణ పూర్తయినంత వరకు ఆగాల్సిందేనని స్పష్టం చేశారు.



తహసీల్దారు శ్రీనును ఇటీవల కలిసిన అంగన్‌వాడీ కార్యకర్తలు

నేడు ఆరాధనోత్సవం

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో సద్గురు త్యాగరాజస్వామి ద్వితీయ ఆరాధన మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నామని నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పి.వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని రెడ్‌క్రాస్ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలుత నవదుర్గమ్మ ఆలయం నుంచి త్యాగరాజస్వామి చిత్రపటంతో టీటీడీ కల్యాణ మండపం వరకు ఊరేగింపు చేపడతామని, ఆ తర్వాత శోభా, నాదస్వర కచేరీలు, పంచరత్న సేవ తదితర కార్యక్రమాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు అభినందనలు

బాడంగి: ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న బాడంగి ఎంపీడీవో ఎస్.రామకృష్ణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీన జిల్లా కేంద్రంలో ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు కలెక్టరు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందించి, సత్కరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సదరు ఎంపీడీవో అవార్డు అందుకున్న విషయం తెలుసుకున్న మండల ప్రజాప్రతినిధులంతా సోమవారం మండల కేంద్రంలోని ఆయన కార్యాలయానికి చేరుకుని, దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో మరింత బాగా పనిచేసి, మరెన్నో ఉత్తమ అవార్డులు పొందాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధు, వైస్ ఎంపీపీ ఎస్.భాస్కరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో రామకృష్ణను సత్కరిస్తున్న నాయకులు

డ్రోన్‌ల సాంకేతికతపై వర్క్‌షాప్

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీలో ఎన్ఎంఐ సీపీఎస్ టిహాన్ ఫౌండేషన్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో డ్రోన్‌ల సాంకేతికతపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఐటీ విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ కాసేపు మాట్లాడారు. ఐదు రోజుల పాటు ఈ వర్క్‌షాపు ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్రోన్ల సాంకేతికత, ప్రాక్టికల్ నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. డ్రోన్ల అనుసంధానం, అప్లికేషన్స్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయానికి అనుమతి ఇవ్వండి

తెర్లాం: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించేందుకు తమ ధాన్యం తీసుకువెళ్తే కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, తమ ధాన్యం విక్రయించేందుకు అనుమతులు ఇవ్వాలని మండలంలోని పలు గ్రామాల రైతులు, స్థానిక నాయకులంతా తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌ను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు తెర్లాం, ఆమిటి, లింగాపురం తదితర గ్రామాల రైతులు వచ్చి, తమ సమస్యను తహసీల్దార్‌కు వివరించారు. తుపాను వర్షాల కారణంగా వరిచేలు నూర్పిడి ఆలస్యమైందని, సంక్రాంతి పండగ తర్వాత నూర్పిడి చేశామన్నారు. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే తమ టార్గెట్ పూర్తయిందని అధికారులు చెబుతున్నారన్నారు. తమ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్.. సమస్యను పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజరుతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె తెలపడంతో ఇదే విషయాన్ని తహసీల్దార్ రైతులకు చెప్పారు.



తహసీల్దార్‌కు తమ సమస్య వివరిస్తున్న రైతులు

ఎంపీడీవో విచారణ

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామ సచివాలయంలో ఈ నెల 22వ తేదీన ఐదుగురు సచివాలయ సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సిబ్బంది హాజరు రిజిస్టర్ చిరిగిపోవడం వంటి ఘటనలపై ఎంపీడీవో కె.సురేష్ కుమార్ సోమవారం ఆ సచివాలయానికి వెళ్లి, విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతోనే ఇటువంటి సమస్య వచ్చిందని, రిజిస్టర్ ఎవరు చింపారో తెలియరాలేదని, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే అంశాన్ని జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ దృష్టిలో ఉంచి, తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

రామభద్రపురం: మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యమని ఫోకస్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పార్వతీపురం జిల్లా ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ ఇన్‌చార్జిగా మండలంలోని కొట్టక్కి గ్రామానికి చెందిన అప్పలరామును సోమవారం నియమించి, ధ్రువీకరణపత్రం, గుర్తింపు కార్డు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఎక్కడైనా మానవ హక్కులకు భంగం కలిగితే అధికారుల సమన్వయంతో రక్షించే చర్యలు చేపట్టాలన్నారు. విషయాన్ని నేషనల్ హ్యూమన్ రైట్స్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు కె.చిన్నారావు, సీహెచ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



అప్పలరాముకు గుర్తింపు కార్డు అందజేస్తున్న హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరినాయుడు

కుష్టువ్యాధిపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో కుష్టువ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగిరంగు మచ్చలు, కాళ్లు పూర్తిగా మూసుకోకపోవడం, చెవితమ్మెలు మందంగా మారిపోవడం వంటివి వ్యాధి లక్షణాలని రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు తెలిపారు. అలాగే వ్యాధి నివారణకు పలు సూచనలు చేశారు.

సమస్యల పరిష్కారానికి మండల కేంద్రానికి రావాలి

బాడంగి: ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రానికి వెళ్లవద్దని, మండల కేంద్రానికి రావాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలెక్టరు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సోమవారం హాజరైన ఆయన.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల కేంద్రాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతోందని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. బొబ్బిలి హెచ్‌పీ కంపెనీ నుంచి గ్రామానికి సోమవారం వచ్చిన గ్యాస్ వ్యాన్ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ స్తంభం విరిగిపోయి వ్యాన్‌పై పడిపోయింది. గ్యాస్‌తో నిండి ఉన్న సిలిండర్లపై స్తంభం ఒక్కసారిగా పడిపోవడంతో ఏదైనా పెద్ద ప్రమాదం జరుగుతుందేమోనని భయపడ్డారు. సచివాలయంలో ఉన్న లైన్‌మేన్ సకాలంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఏఈ.. గ్రామానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం బొబ్బిలి డీఈకి నివేదిక పంపించారు.



కూనాయవలసలో గ్యాస్ వ్యాన్ ఢీకొనడంతో విరిగిపడిన విద్యుత్ స్తంభం

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని విజయరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన.. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, విద్యార్థుల హోమ్‌వర్క్, చేతిరాత పుస్తకాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం వంటకాలు తనిఖీ చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని తెలిపారు.

మండల సమాఖ్య ప్రెసిడెంట్‌పై కక్ష సాధింపు చర్యలు

- తప్పులు ప్రశ్నిస్తే తొలగింపు నిర్ణయం

రామభద్రపురం: వెలుగు ఏపీఎం అన్నపూర్ణ, వీవోఏ బాల కలిసి తనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరికతోట గ్రామ మండల సమాఖ్య ప్రెసిడెంట్ కిలాడ అరుణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఇదే విషయమై ఆమె.. డీఆర్‌డీఏ పీడీకి అందించేందుకు వినతిపత్రం రాసి, విలేకరులకు తన గోడు చెప్పుకుంది. తాను ఏ తప్పు చేయకుండా ఎందుకు తొలగించే చర్యలు చేపడుతున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. ఎవరితోనూ గొడవలు లేవని, ఇటీవల మండల సమాఖ్యలో ఖర్చులు, లావాదేవీలు అడిగినందుకే తనపై కక్ష పెట్టుకుని, తొలగింపుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏ పదవికైనా కాల పరిమితి ఉంటుందని వీవోలో అయినా, ఎంఎస్‌లో అయినా కనీసం ఆరు నెలలు కూడా అవ్వకుండా ఇలాంటి కక్షపూరిత నిర్ణయం తీసుకుంటున్నారన్నారు. నేను కేవలం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళను కాబట్టే తనను క్షోభ పెడుతున్నారన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి ఎంఎస్‌లో చెక్ సంతకాలకు గానీ, ఎటువంటి కార్యక్రమాలకు గానీ కనీస సమాచారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిస్తున్నారన్నారు. తన తప్పు లేదని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఏపీఎం అన్నపూర్ణను వివరణ కోరగా అటువంటిదేమీ లేదని, నింబధనల ప్రకారమే మండల సమాఖ్యలను ఏటా మార్పులు, చేర్పులు చేయడం జరుగుతోందన్నారు. సభ్యులందరి తీర్మానం మేరకే తొలగింపు అని, ఆమె తొలగింపు నిర్ణయంలో మాత్రం రాజీ లేదని స్పష్టం చేశారు.



డీఆర్‌డీఏ పీడీకి రాసిన వినతిపత్రాన్ని చూపిస్తున్న మండల సమాఖ్య ప్రెసిడెంట్ అరుణ

సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్

రాజాం: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌తో పాటు దివ్యాంగుల లోపం నిర్ధారణకు తనిఖీలు సోమవారం నిర్వహించారు. వెలుగు ఏసీ చిరంజీవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిబాబులు ఈ తనిఖీలను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

అక్రమ భూ బదలాయింపుపై ఫిర్యాదు




వెబ్‌ల్యాండ్‌లో భూమి లేనివారి పేరుతో మ్యుటేషన్ చేపట్టి, అక్రమంగా భూ బదలాయింపు చేశారని శ్రీహరిపురానికి చెందిన శెట్టి జ్యోతి మండిపడ్డారు. ఇదే విషయమై వంగర తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు డి.ధర్మరాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. వీఆర్వో బి.శాంతికుమార్ చేతివాటం ప్రదర్శించడంతో తప్పుగా భూ బదలాయింపు జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాగులోని భూమిని వేరొకరి పేరిట మార్చడం అన్యాయమన్నారు. ఇదే అంశంపై దర్యాప్తు చేసేందుకు డీటీ హరిరమణారావును ఆదేశించినట్లు తహసీల్దారు తెలిపారు. –వంగర

సీపీఎం నిరసన



వంగర తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసనకు దిగారు. తలగాం గ్రామానికి చెందిన 16కు పైగా దళిత కుటుంబాల వారు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని వారికి తిరిగి ఇప్పించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబరు 6లో 16.73 ఎకరాల భూమిని ఆ గ్రామ దళితులు సాగు చేసేవారని, అయితే రెవెన్యూ అధికారుల చేతివాటంతో ఆ భూమిని పెత్తందారులకు కట్టబెట్టారని విమర్శించారు. దీంతో బాధిత దళిత కుటుంబాల వారు వీధిన పడ్డారన్నారు. అధికారులు స్పందించి, బాధిత దళితులకు ఆ భూమి అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు పి.శంకరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. –వంగర

మంచుదుప్పటి



సంతకవిటి మండలాన్ని మంచుదుప్పటి కప్పేస్తోంది. వారం రోజులుగా కురుస్తున్న దట్టమైన పొగమంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. దగ్గరకు వెళ్తే తప్ప అక్కడ ఏం ఉందో తెలియడం లేదు. టార్చిలైట్లు, సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని మరీ బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. సంతకవిటి మండలంలోని లాబాం–పోతులజగ్గపేట వంతెనపై సోమవారం కురిసిన మంచు దృశ్యం. –సంతకవిటి

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. బాడంగి మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయ స్టాల్ సోమవారం ఏర్పాటు చేసి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరల అమ్మకాలు చేపట్టారు. సేంద్రియ ఎరువులు వేసి పండించిన పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలని ఆయన కోరారు. అనంతరం కార్యాలయ సిబ్బంది కూరగాయలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సింహాచలం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.సత్యనారాయణ, టి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. –బాడంగి